క్లుప్తంగా

పర్ణశాలలో కృష్ణాష్టమి..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పర్ణశాల దేవస్థానంలోని శ్రీ కృష్ణ స్వామివారికి విశేష తిరుమంజనం జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉయ్యాల సేవను చేపట్టారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక ప్రసాదాన్ని నివేదించి విచ్చేసిన భక్తులందరికీ అందచేశారు. ఈ వేడుకలలో భద్రాచల ఉప ప్రధానార్చకులు శ్రీమాన్ కోటి రామస్వరూప రాగవాచార్యులు, ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, కోటి విష్ణువర్ధనాచార్యులు, భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, వెంకట ఆచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెంచ్‌ప్రెస్ పోటీల్లో బంగారు పతకాలు

మణుగూరురూరల్: కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన బెంచ్ ప్రెస్ కాంపిటీషన్‌లో మణుగూరు స్కైజిమ్ యువకులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు జిమ్ మాస్టర్ రవీందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ జిమ్‌కు చెందిన నాగరాజు, రాజులతో పాటు మరో ఇద్దరు యువకులు బంగారు, పొదిల సుబ్బారావు, నిహాల, సాబీర్‌లతో పాటు మరో ఏడుగురు వెండి పతకాలు సాధించినట్లు వెల్లడించారు. ఆయా యువకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పాఠశాలలో హిందీ దివస్

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హిందీ భాషా ఉపాధ్యాయుడు డాక్టర్ ఎస్.మధుసూదన్ రావు, శేషయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు, పాఠశాలలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిక్షనరీల వితరణ

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ జూపల్లి ఉపేంద్రబాబు, అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, డిక్షనరీలను వితరణగా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రను ఎమ్మెల్యే, గ్రామస్తులు శాలువాతో మర్యాదపూర్వకంగా సన్మానించి, అభినందించారు. అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఫ్రెండ్స్ చేయూత ఫౌండేషన్ వారు ఎమ్మెల్యే సమక్షంలో బెంచీలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గంటా వీరాచారికి కడుపులో నొప్పికి సంబంధిచి సర్జరీ చేయాల్సి ఉండగా.. ఆ ఖర్చుల నిమిత్తం చర్లలోని మేమున్నాం మీ కోసం సహాయక కమిటీ సోమవారం రూ.10 వేల నగదును బాధిత కుటుంబానికి అందజేసింది. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ లయన్ డాక్టర్ నీలి ప్రకాశ్, కమిటీ సభ్యులు ఇర్పా అనుసూయ, దొడ్డి తాతారావు, మట్టపల్లి సంతోష్ యాదవ్, దొడ్డా ప్రభుదాసు, మండలోజు సత్యనారాయణ, దొడ్డి సూరిబాబు, రామ్మోహన్ రావు, గాదెరాజ్రుసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చర్ల: నాయీ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు తోటపల్లి మాధవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన నాయీ బ్రాహ్మణుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, 50 యేళ్లు నిండిన వృత్తిదారులకు పింఛన్, వృత్తిదారులు షాపులను ఏర్పాటు చేసుకునేందుకు 50 శాతం సబ్సిడీపై రూ.5 లక్షల వరకు రుణాలను అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం చర్ల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తోటపల్లి రమణ, సుంకరి రాజేష్, ఉపాధ్యక్షులుగా కోండ్రు హరీష్ గౌరవ అధ్యక్షుడిగా సంగెపు బీమరావు, గౌరవ సలహాదారులుగా తోటపల్లి శ్రీనివాసరావులతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వేతనాలు పెంచాలి

దమ్మపేట: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేతనాలను వెంటనే పెంచాలని సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. అంగన్‌వాడీలు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి, ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరమ్మ, జయ, జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వానలతో రైతుల్లో ఆశలు

- చెరువులు, కుంటలు నిండడంతో ఊరట
- ప్రాణంపోసుకున్న పంటపొలాలు
- కలుపు నియంత్రణ, తెగుళ్లపై అప్రమత్తత అవసరం


నిండుకుండలా ఉన్న పద్మాపురం బుగ్గ చెరువు


కరకగూడెంలో కళకళలాడుతున్న వరి పొలం

కరకగూడెం: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు మండలంలోని రైతులకు ఆనందాన్ని తెచ్చాయి. మొక్కజొన్న, పత్తి, వరి వంటి ప్రధాన పంటలకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. నీటి కొరతతో వాడిపోయిన పంటలు మళ్లీ ప్రాణం పోసుకుని, పచ్చగా కళకళలాడుతున్నాయి.

మొక్కజొన్న, పత్తి, వరికి ఊతం

మండల వ్యాప్తంగా ఈ ఏడాది వరి 10,110, పత్తి 7,005, మొక్కజొన్న 1,000, ఆయిల్ పామ్ 95, పప్పు ధాన్యాలు 55 ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. కాగా తేమ అత్యంత కీలకమైన మొక్కజొన్నకు సరైన తడి అందితే మొక్కలు వేగంగా పెరుగుతూ.. గింజలు నిండే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుత వర్షాలకు ఈ విధమైన సానుకూల వాతావరణం కనిపిస్తోంది. మరోవైపు సాగులో ఉన్న పత్తి పంటలకు ఈ వర్షాలు అత్యంత అనుకూలంగా మారాయి. మొక్కల్లో చిగుళ్ల బాగా రావడం, ఆకులు విస్తరించి బలంగా నిలవడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే వరి పంటకు చెరువులు, కుంటలు, వాగులు వరదనీటితో నిండిపోవడంతో సాగునీరు సమృద్ధిగా లభిస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి

వర్షాలు అధికంగా కురవడం వల్ల కలుపు మొక్కలు విస్తరించే ప్రమాదం ఉంది. అందుకే రైతులు సమయానికి కలుపు నియంత్రణ చర్యలు తీసుకోవాలి. పత్తి పంటలో తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండి అవసరమైతే జీవవాయువులు లేదా తగిన మందులు ఉపయోగించాలని అధికారులు సూచిస్తున్నారు. వరి పంటలో ఎరువులను సక్రమంగా వినియోగించడం వల్ల దిగుబడి మరింత పెరుగుతుందని చెబుతున్నారు. ఆయా విషయాలపై రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చు.

వర్షాలు ధైర్యాన్ని ఇచ్చాయి..



ఈసారి వర్షాలు మాకు ప్రాణం పోశాయి. ఎండలకు పొలాలు ఎండిపోయి, పైర్లు వాడిపోతుంటే గుండె పగిలినంత పనైంది. ఇక ఈ సంవత్సరం పంట పోయిందనుకున్నాం. కానీ ఆ దేవుడు కరుణించి వానలు పంపాడు. కురుస్తున్న ఈ వానలకు పొలాలు పచ్చగా మారి మాకు ధైర్యాన్నిచ్చాయి.

– గిద్దె స్వరూప, యువ రైతు, నర్సంపేట కాలనీ

దిగుబడిపై నమ్మకం ఏర్పడింది..



గత రెండు నెలలుగా పొలంలో నిలిచిన పత్తి మొక్కలు ఎండిపోతాయేమోనని భయపడ్డాం. కానీ ఈ వర్షాలు పడగానే మొక్కలు మళ్లీ పచ్చగా మారాయి. ఆకులు విస్తరించి, చిగుళ్లు బాగా వచ్చాయి. ఇలాగే వర్షాలు పడితే ఈసారి పత్తి దిగుబడి బాగుంటుందని నమ్మకం కలిగింది.

– జిగట మల్లయ్య, రైతు, మొగిలితోగు

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి..



సాగులో ఉన్న మొక్కజొన్న, పత్తి, వరి పంటలు ఇప్పుడు పడుతున్న వర్షాల వల్ల బలపడుతున్నాయి. ఈ సమయాల్లో కలుపు మొక్కలు విస్తరించే అవకాశం ఉంది. అందువల్ల రైతులు కలుపు నియంత్రణ చర్యలను తప్పనిసరిగా తీసుకొని తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– ఛటర్జీ, ఏఓ, కరకగూడెం

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి


పప్పు రుచి చూస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

ములకలపల్లి: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారికి చక్కటి భోజనం అందించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశించారు. మూకమామిడి శివారులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్‌ఎస్)ను సోమవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. కిచెన్ షెడ్‌తోపాటు, స్టోర్‌రూంలోని కూరగాయలని పరిశీలించారు, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. రికార్డులను పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నాణ్యమైన విద్య బోధించాలని, తద్వారా చక్కటి ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ పక్కగా అమలు చేయాలన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న మండల పరిధిలోని కావడిగుండ్ల పల్లె ప్రకృతి వనాన్ని ఎట్టకేలకు శుభ్రం చేయించే పనులు చేపట్టారు. సోమవారం 'సాక్షి'దినపత్రికలో 'ఆహ్లాదం కాదు..అధ్వానం'శీర్షికన ప్రచురితమైన కథనంపై స్థానిక ఎంపీడీఓ అప్పారావు స్పందించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి మోతీలాల్ పర్యవేక్షణలో పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తచెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. ఏడాది తర్వాత ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టడంతో గ్రామస్తులు, ప్రకృతి ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

దుమ్ముగూడెం: పంటలకు సరిపడా యూరియా సరఫరా చేయాలని, ఆ మేరకు ప్రతీ రైతుకు రెండు బస్తాల యూరియా అందించాలని బీఆర్‌ఎస్ జిల్లా, డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నర్సాపురం గ్రామంలోని సొసైటీ గోడౌన్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజుల తరబడి యూరియా కేంద్రాల వద్ద పడిగాపులు గాసిన యూరియా దొరకని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, నాయకులు మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, సొసైటీ డైరెక్టర్లు బొల్లి వెంకట్రావు, కాలవ పూర్ణయ్య, పిసోడి వెంకటేష్, కొత్త మల్లేశ్వరావు,తునికి కామేష్ దామెర్ల శ్రీనివాసరావు, రావులపల్లి పృథ్వీ, వాగే కిట్టు, కుమ్మరికుంట సూర్య, భూక్యా చందు, కురసం భాస్కర్, గుండి రవి, కాటిబోయిన శ్రీను, గుండి ధర్మ పాల్గొన్నారు.

యూరియా కొరతపై ఆందోళన వద్దు


కరకగూడెం: యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ తాతారావు

కరకగూడెం: యూరియా కొరతపై రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మణుగూరు ఏడీఏ తాతారావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతారం రైతు వేదికను సందర్శించిన ఆయన.. అక్కడ టోకెన్ల విధానంలో జరుగుతున్న యూరియా పంపిణీని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం యూరియా సరఫరా సమృద్ధిగా ఉందని, రైతు వేదికల ద్వారా ప్రతి రైతుకీ పారదర్శకంగా పంపిణీ జరుగుతోందని తెలిపారు. నానో యూరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ ఛటర్జీ, ఏఈఓ అనిల్ కుమార్, పీఏసీఎస్ సిబ్బంది చందా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంచాలని ధర్నా


భద్రాచలంటౌన్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పెన్షన్‌దారులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పెన్షన్ పెంచి ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారుల సంఘం, మద్దతు తెలిపిన ఇతర పార్టీల, సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేలు, ఇతర పెన్షన్ దారులకు రూ.4 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తహసీల్‌లోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్


అశ్వాపురం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, దివ్యాంగులు


దమ్మపేట: తహసీల్దార్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తులను చేసుకున్న 42 కుటుంబాలకు రూ.12 లక్షల 40వేల 500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రక్చర్ సమావేశం బహిష్కరణ


ఫిట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు రంగయ్య

మణుగూరుటౌన్: స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లను అమలు చేయడంలో యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. తాజా స్ట్రక్చర్ సమావేశాన్ని యూనియన్ బహిష్కరించినట్లు ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య తెలిపారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో, పీకేఓసీ–2 ఫిట్ సమావేశంలో వేర్వేరుగా మాట్లాడారు. స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లను అమలు చేయకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, రాంనర్సయ్య, ఈశ్వర్‌రావు, నాగరాజు, ఆదర్శ సురేందర్, సురేంద్రరావు, కుమారస్వామి, రవి, సాయిప్రకాష్ చారి, రత్నం శివకుమార్ పాల్గొన్నారు.

డైలీవేజ్ కార్మికుల ధర్నా

భద్రాచలంటౌన్: వసతి గృహాల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల జీతాలు తగ్గించే జీఓ 64ను, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల జీతాలు తగ్గించే జీఓ 527ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్, ఐటీడీఏ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం సంఘీభావం తెలపగా.. జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు కార్మికుల పక్షాన మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంప్ ఎదుట ధర్నా వద్దకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు రాగా.. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఫోన్ చేసి ఆయన సమస్యను వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, ఏజె.రమేష్, పి.శ్రీనివాస్, రాజేష్, శ్రీను, హరికృష్ణ, కుంజా శ్రీను, వజ్జా సురేష్, పిట్టల అర్జున్, హీరాలాల్, మంగీలాల్, కౌసల్య, భద్రయ్య, దాసు, పాయం ముత్తయ్య, స్వామి, పండ మంగమ్మ, నాగమణి, రమణ, జలంధర్, జయ, తిరుపతమ్మ, స్వరూప, ముసలయ్య, నాగేశ్వర రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రముఖులను కలిసిన రామాలయ ఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ ఈఓ ఆర్.దామోదర్‌రావు సోమవారం పలువురు ప్రముఖులను కలిశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, అటవీ శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టను వారి కార్యాలయాలలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. అలాగే, ఆలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్ వారికి వేదాశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదాలను దేవస్థానం అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలు, భక్తులకు వసతుల కల్పనపై వారు ఈఓతో చర్చించారు.

క్షత్రియ సేవా సంఘం సమావేశం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శ్రీ రామభద్ర నిలయంలో సోమవారం క్షత్రియ సేవా సంఘం బుద్ధాం వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణ రాజు, కోనాధ రాజు సోమరాజు హాజరై మాట్లాడారు. తమ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ్య పుణ్యక్షేత్రాల వద్ద సత్రాలతోపాటు, అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి కాశీ విశ్వనాథరాజు, ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ఉమ్మడి రాష్ట్రంలోని క్షత్రియులు హాజరయ్యారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ


అన్నపురెడ్డిపల్లి: శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

సాక్షి నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పోషణా బీ– పడాయి బీ'కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓలు మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు చిన్నారులకు పోషణ అందించడంతోపాటు బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓలు, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్లు, టీచర్లు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


బూర్గంపాడు: సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు: ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు రైతు వేదికలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నిశాఖల అధికారులు విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశానికి సరైన నివేదికలతో రాకుండా మొక్కుబడిగా రావడం.. ఇంకొందరు అధికారులు కిందిస్థాయి సిబ్బందని పంపడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ జమలారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఎంఈఓ యదుసింహరాజు, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు ప్రారంభం

మణుగూరుటౌన్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలోని నాయుడుకుంట చెరువు కట్టపై సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్, బండ్ అభివృద్ధి, చెరువు చుట్టూ సైడ్ డ్రైన్, పూలమార్కెట్–పబ్లిక్ టాయిలెట్స్ వరకు సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.4.90 కోట్ల టీయుఎఫ్ఐడీసీ నిధులతో ఈ పనులు నిర్వహిస్తున్నాట్లు ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ టి.ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాస్‌లతో కలిసి స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. ఆపై అంబేడ్కర్ సెంటర్‌లోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి.. వసతి, మెనూ తదితర అంశాలపై విద్యార్థులను ఆరా తీశారు. కార్యక్రమంలో మండల నాయకులు నవీన్, శివ సైదులు, బానోత్ లక్ష్మణ్ నాయక్, రహీంపాషా, గోరంట్ల కనకయ్య, లారీ, బొగ్గు యూనియన్ నాయకులు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి


చర్ల: ప్రజావాణిలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్, పాల్గొన్న అధికారులు

చర్ల: చర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయగా.. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఏడుగురు వారి సమస్యలపై అధికారులకు దరఖాస్తులను అందజేశారు. వీటిల్లో ఆరు దరఖాస్తులు భూసంబంధ సమస్యలే. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, మండల పరిషత్ సూపరింటెండెంట్ రవీంద్రనాథ్, వ్యవసాయశాఖ ఏఓ లావణ్య, మిషన్ భగీరథ ఏఈ రాము, ఇరిగేషన్ ఏఈ సంపత్, విద్యుత్‌శాఖ లైన్‌మెన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పినపాక: మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. అన్ని శాఖల అధికారుల సమక్షంలో తహసీల్దార్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. మహిళలు ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ పాస్ పుస్తకాల్లో లోటుపాట్లు తదితర సమస్యలపై వినతులు అందాయి. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. గ్రీవెన్స్ డేలో ఎంపీడీఓ సునీల్ కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ వైద్యురాలు శృతి పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే..


ములకలపల్లి: అమరులకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

దుమ్ముగూడెం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే మాత్రమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం వీర తెలంగాణ రైతంగ సాయుధ పోరాట సభను ములకపాడు సెంటర్ వైఎస్ఆర్ భవనంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొర్సా చిలకమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ములకలపల్లి: తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చి, భావితరాలకు అందించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ అన్నారు. తెలంగాణా రైతాంగ పోరాటాల వారోత్సవాల సందర్భంగా సోమవారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకూరి సీతాలక్ష్మి పతాకాన్ని ఆవిష్కరించారు. మండల కార్యదర్శి ఎండీ. యూసఫ్, నరాటి రమేశ్, జబ్బార్, వీరభద్రా రెడ్డి, సడియం నాగరాజు, వెంకటేశ్, వీరూనాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సివిక్‌యాక్షన్ ప్రోగ్రాం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా న్యూ ఎఫ్‌బి తుమ్మలబట్టిలో సివిక్‌యాక్షన్‌లో భాగంగా సోమవారం 217 బెటాలియన్ సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. బాలికలకు సైకిళ్లు, రేడియో సెట్లు, చీరలు, దుప్పట్లు గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అమితవ సాహూ సిఎంఓ,నీర్ సింగ్ మీనా 2 ఐసీ ఆపరేటర్స్, సంగిత్ కుమార్ ఓసీఎఫ్ కోయ్ 217, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహా మేధావి విశ్వేశ్వరయ్య



మణుగూరురూరల్: సన్మానం అందుకుంటున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: ప్రఖ్యాత సివిల్ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్‌డేను సోమవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీర్లను సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ ప్రతిభతో ఎన్నో నీటి పారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసి రైతాంగానికి ఎనలేని సేవలందించిన మహామేధావి విశ్వేశ్వరయ్య అని కొనియాడారు.

విద్యార్థులకు అభినందన

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే సోమవారం సందర్శించి పీజీ సీట్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి డాక్టర్, ఎమ్మెల్యేగా మీ ముందుకు వచ్చానని చెప్పారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో రక్తదానం

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో తెలంగాణ 11వ ఎన్‌సీసీ ఖమ్మం బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లతో పాటు అధికారులు మొత్తం 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఎన్‌సీసీ క్యాంపు పరిపాలనాధికారి నవీన్ యాదవ్, క్యాంపు అధికారి సంజయ్, అశ్వాపురం వైద్య సిబ్బంది, భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.